25న కలెక్టరేట్ల వద్ద ధర్నా

విజయనగరం : కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25న కలెక్టరేట్ల వద్ద ధర్నా చేయాలని అమరావతి జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ జెఎసి అధ్వర్యంలో నిర్వహించిన జూమ్ మీటింగ్ లో వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రభుత్వ సంస్థలు, వివిధ శాఖలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, వారికి జీతాలు పెంచాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం ఏయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జెఎసి అధ్యక్ష, కార్యదర్శులు కె.సుమన్, దూసి భానోజి రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడంలో మీన మేషాలు లెక్కిస్తోందన్నారు. ఈనేపథ్యంలో నిర్వహించే ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు.కార్యక్రమంలో ఉమ్మడి విజయనగరం జిల్లా జెఎసి అధ్యక్షులు జి. మహేంద్రబాబు, జిల్లా కోశాధికారి రామ్ గోపాల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీధర్, జిల్లా సభ్యులు జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో చర్చిస్తున్న మంత్రి అమర్‌నాథ్

ఉత్తరాంధ్ర ప్రజల కల

త్వరలో నెరవేరుస్తాం

- భోగాపురం ఎయిర్‌పోర్టు శంకుస్థాపనకు ముహూర్తం ఖరారు
- ఐటి, పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్
- విమానాశ్రయ భూముల పరిశీలన

ప్రజాశక్తి-భోగాపురం

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి, మే 3వ తేదీన శంకుస్థాపన చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి నిర్ణయించారని, రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, మౌలిక వసతుల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. ఈ విమానాశ్రయ నిర్మాణం ద్వారా, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుందని పేర్కొన్నారు. భోగాపురం విమానాశ్రయ నిర్మాణానికి సేకరించిన భూములను మంత్రి అమర్‌నాథ్ సోమవారం సందర్శించారు. ట్రంపెట్ రహదారి నిర్మాణం జరిగే ప్రదేశాన్ని, ముఖ్యమంత్రి నిర్వహించే భారీ బహిరంగ సభ ప్రదేశాలను ఆయన పరిశీలించారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంఎల్ఎ బడ్డుకొండ అప్పలనాయుడు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలెవన్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో, అంతకుముందు సన్‌రే రీసార్ట్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన భూ సేకరణ ప్రక్రియను తెలుసుకున్నారు. శంకుస్థాపన, ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లపై అధికారులు, నాయకులతో చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మీడియాతో, భోగాపురం విమానాశ్రయ నిర్మాణాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా భావిస్తోందని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రజల సుదీర్ఘ స్వప్నం నెరవేరే రోజు ఆసన్నమయ్యిందన్నారు. శంకుస్థాపన జరిపేందుకు అవసరమైన అన్ని రకాల లాంఛనాలను పూర్తి చేశామని చెప్పారు. సుమారు 2,200 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమయ్యే ఈ ఎయిర్‌పోర్టుకు, ఇప్పటికే దాదాపు 2,195 ఎకరాల భూసేకరణ పూర్తి అయ్యిందని, మిగిలిన కొద్దిపాటి భూ సేకరణ కూడా త్వరలో పూర్తి కానుందని తెలిపారు. ఏ ఒక్కరికీ ఇబ్బంది కలగకుండా ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పారు. శంకుస్థాపన అనంతరం 24 నుంచి 30 నెలల్లో విమానాశ్రయ నిర్మాణం పూర్తి అవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా భారీ భహిరంగ సభను నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ పర్యటనలో జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల ఎంఎల్ఎ బడ్డుకొండ అప్పలనాయుడు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలెవన్, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ కెవి రెడ్డి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, తాహశీల్దార్ కె.శ్రీనివాసరావు, ఎయిర్‌పోర్ట్ భూసేకరణ సమన్వయాధికారి అప్పలనాయుడు, జిఎంఆర్ సిఇఒ మన్మయ్, ప్రాజెక్టు మేనేజర్ రామరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగాన్ని ప్రోత్సహించాలి

వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జెడ్‌పి ఛైర్మన్

వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు మరింత చేరువ చేస్తూ డ్రోన్ల వినియోగాన్ని ప్రోత్సహించాలని, తద్వారా లాభదాయక ఫలితాలు సాధించేలా తోడ్పాటు అందించాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. నైపుణ్యం కలిగిన వారితో ప్రత్యేక శిక్షణా శిబిరాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని రకాల సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేసిన పిమ్మట క్షేత్ర స్థాయిలో ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టాలని చెప్పారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో సోమవారం జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ ప్రణాళిక, నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై వ్యవసాయ అధికారులు వివరించగా వాటిపై స్పందించిన ఆయన రైతులకు ప్రయోజనం కల్పించేలా సాంకేతికతను చేరువ చేయాలని, వ్యవసాయాన్ని లాభాదాయకంగా మార్చి వారికి అండగా నిలవాలని హితవు పలికారు.

రాష్ట్ర ప్రభుత్వం 40శాతం రాయితీపై అందించే డ్రోన్ల ఆవశ్యకతను రైతులకు తెలియజేయాలని, మందుల పిచికారీ విధానంలో వాటి వినియోగాన్ని విడమరిచి చెప్పాలని పేర్కొన్నారు. ఒక్కో మండలానికి మూడు డ్రోన్లు అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, జిల్లాకు సుమారు 20 డ్రోన్లు వచ్చే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ అధికారి వి.టి. రామారావు జెడ్‌పి ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. వీటిని వినియోగించే వారికి శిక్షణ, సంబంధిత లైసెన్సును ప్రభుత్వమే సులభతర రీతిలో అందజేస్తుందని వివరించారు. ఖరీఫ్, రబీ పంటకాలాలను దృష్టిలో ఉంచుకొని సాగునీరు విడుదల చేయాలని, ఆయా ప్రాజెక్టుల పరిధిలో కాలువల నవీనకరణ, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ క్రాప్, ఇకెవైసి ప్రక్రియలను మరింత సమర్ధవంతంగా నిర్వహించాలని, జిల్లా స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకు సమాచార లోపం లేకుండా చూసుకోవాలని చెప్పారు.

కొత్తరకం వంగడాలపై దృష్టిసారించాలి

జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ షరా మాములూగా కాకుండా విభిన్నంగా ఆలోచించాలని నూతన వంగడాలను ప్రవేశ పెట్టాలని సూచించారు. ఈ విషయంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. 1121 వరి వంగడం తాలూకా ఫలితాలు బాగానే ఉన్నాయని, దానికి ప్రత్యామ్నాయంగా మార్కెటింగ్ సౌకర్యం బాగా ఉన్న ఎం.టి.యు. 1318 వరి వంగడాన్ని నీటి సదుపాయం బాగా ఉన్న ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయానికి కూడా అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, సాగులో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత పెంచాలని, యంత్రసేవా సంఘాల సభ్యులను మరింత ప్రోత్సహించాలని సూచించారు. రసాయనిక ఎరువుల వినియోగం వల్ల మామిడి పంటపై దుష్ప్రభావం పడిందని జెడ్‌పి ఛైర్మన్ ఈ సందర్భంగా విచారం వ్యక్తం చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా రైతుల అవసరాలకు ఎరువును సరఫరా చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గేదెల వెంకటేశ్వర రావు, డిసిఎంఎస్ ఛైర్‌పర్సన్ అవనాపు భావన, జిల్లా వ్యవసాయ అధికారి వి.టి. రామారావు పలు అంశాలపై చర్చించారు. సలహాలు, సూచనలు అందించారు. పశుసంవర్ధక శాఖ, ఉద్యాన శాఖ, మత్స శాఖ, సివిల్ సప్లై, మార్కెటింగ్, మార్క్ ఫెడ్ తదితర శాఖల జిల్లా స్థాయి అధికారులు, వివిధ బ్యాంకుల నుంచి ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు 176 వినతులు

ప్రజాశక్తి-విజయనగరం

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 176 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 115 ఉన్నాయి. హౌసింగ్‌కు 9, మున్సిపల్ శాఖకు 3, వైద్య శాఖకు 9, డిఆర్‌డిఎకు 14 వచ్చాయి. పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై మిగిలిన వినతులు అందాయి. జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతిరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పద్మలత, దొర సూర్యనారాయణ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

జీడిపిక్కల ధర పెంచాలని వినతి

విజయనగరం టౌన్ : జీడిపిక్కలకు ధర పెంచి, ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి సేకరించాలని పి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, గిరిజన సంఘం నాయకులు జె.గౌరీష్ కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో వారు జెసికి వినతి పత్రం అందజేశారు. జిసిసి ద్వారా జీడిపిక్కలను కొనుగోలు చేయకపోవడంతో దళారులు ఇచ్చినంత తీసుకోవలసి వస్తోందన్నారు. కిలోకు రూ.160 ఇచ్చి, ఎస్.కోట, మెంటాడ మండలాలతోపాటు జీడిపంట ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు.

ఉపాధి పనుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

విజయనగరంకోట : గ్రామీణ ఉపాధి హామీ పనులలో కనీస సౌకర్యాలు కల్పించాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. పనుల వద్ద కూలీలకు కనీస వసతులు కల్పించాలని కోరుతూ స్పందనలో వినతులు ఇచ్చారు. అనంతరం నాయకులు మాట్లాడుతున్న కూలీలకు గతంలో ఇచ్చిన విధంగా నీడ కల్పించేందుకు టెంట్లు, మజ్జిగ, పనిముట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం మండల టిడిపి అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, గంటా పోలి నాయుడు, వేచలపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛను పెంచాలని డప్పుకళాకారుల ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న డప్పు కళాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డప్పు కళాకారులకు పింఛను పెంచాలని, ఎస్‌సి కార్పొరేషన్ రుణాలు పునరుద్ధరించాలని డప్పు కళాకారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు రాకోటి రాములు, జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్ డిమాండ్ చేశారు. జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన డప్పు కళాకారులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అందరికీ పింఛను పెంచి డప్పు కళాకారులకు పెంచకపోవడం అన్యాయమన్నారు. ఇది దళితులపైన ప్రభుత్వానికి ఉన్న వివక్షతని విమర్శించారు. పింఛను రూ.5 వేలకు పెంచాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్‌సి కార్పొరేషన్లను రద్దుచేసి 29 రకాల సంక్షేమ పథకాలను దళితులకు అందకుండా దూరం చేసిందన్నారు. గడిచిన నాలుగు సంవత్సరాలుగా డప్పు కళాకారులకు డప్పులు, గజ్జెలు, దుస్తులు, చర్మకారులకు కిట్లు పంపిణీ చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. బస్సు, ట్రైన్ పాస్‌లు, అర్హులైన దళితులకు మూడు ఎకరాలు భూమి ఇవ్వాలని డిమాండ్‌చేశారు. దళితులు సాగు చేస్తున్న భూములకు సాగు హక్కులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎం.రామారావు, సన్యాసి, దుర్గారావు, డప్పు కళాకారులు పాల్గొన్నారు.

స్నేహితుని మృతదేహాన్ని చూసేందుకు వస్తూ...

తిరిగిరాని లోకాలకు..!

మృతిచెందిన వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్నేహుతుని మరణవార్త విని చూసేందుకు వచ్చిన ఓ వ్యక్తి ప్రమాదవ శాత్తూ మరణించాడు. స్థానిక రైల్వేస్టేషన్‌లో సోమవారం జరిగిన ఈ సంఘటన కుటుంబ సభ్యులను, స్నేహితులను, చూపరులను తీవ్రంగా కలచివేసింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం పూనిబుచ్చంపేట గ్రామానికి చెందిన మర్రి రమణ మరణించాడు. ఆయన కుమార్తె స్వాతి పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో డిగ్రీ చదువుతోంది. రమణ భౌతికకాయాన్ని చూసేందుకు పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం కాకిలేరు గ్రామానికి చెందిన ఆయన స్నేహితుడు ఉన్నమట్ల వెంకటేశ్వరరావు(46)... పాలకొల్లులో ఉన్న స్వాతిని తీసుకుని వస్తున్నాడు. తిరుపతి నుంచి బిలాస్‌పూర్ వెళ్తున్న రైలులో వస్తూ బొబ్బిలి రైల్వేస్టేషన్లో దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడటంతో అక్కడికక్కడే వెంకటేశ్వరరావు మరణించాడు. స్నేహుతుని మృతదేహాన్ని చూసేందుకు వస్తూ వెంకటేశ్వరరావు మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మృతుడు వెంకటేశ్వరరావు భార్య సునీత ఉపాధి కోసం మస్కట్‌లో ఉంటోంది. వెంకటేశ్వరరావుకు ఐదుగురు పిల్లలు ఉన్నారు. బొబ్బిలి రైల్వే పోలీసులు బి.ఈశ్వరరావు, శంకరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పోస్టుకార్డు ఉద్యమం



పోస్టుబాక్సుల్లో కార్డులు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జై భారత్ సత్యాగ్రహ కార్యక్రమం భాగంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డుల ఉద్యమం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు లక్కరాజు రామారావు, డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పూడి శ్రీనివాసరావు , కాంగ్రెస్ నగర అధ్యక్షులు సతీష్, తదితరులు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు.

నేడు జిల్లాకు కలెక్టర్ నాగలక్ష్మి రాక

విజయనగరం : జిల్లాకు నూతన కలెక్టర్‌గా నియమితులైన నాగలక్ష్మి సెల్వరాజన్ మంగళవారం జిల్లాకు వస్తున్నా రు. సాయంత్రం ప్రస్తుత కలెక్టర్ సూర్యకుమారి వీడ్కోలు అభినందన కార్యక్రమంలో పాల్గొంటారు. బుధవారం కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు.

అంగన్వాడీ ఆయా పోస్టుకు రూ.8 లక్షలు

అధికారులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని సంతగైరమ్మపేట గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ ఆయా పోస్టును రూ.8 లక్షలకు అనర్హులకు అమ్మారని గ్రామానికి చెందిన గోగాడ అప్పారావు.. ఐసిడిఎస్ సిడిపిఒ ఉమ, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బందికి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గోగాడ అప్పారావు మాట్లాడుతూ అంగన్వాడీ ఆయా పోస్ట్ భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు కర్ణాటక రాష్ట్రంలో ఓపెన్ టెన్త్ సర్టిఫికెట్ పొందిన మహిళకు రూ.8 లక్షలకు ఆయా పోస్టును అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ విషయమై అధికారులు విచారణ చేపట్టి, అర్హులకు ఆయా పోస్టు ఇప్పించాలని అధికారులను కోరారు.

తప్పుగా ప్రవర్తిస్తే న్యాయబద్ధంగా వెళ్తాం

తప్పుడు ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందడం సరికాదని టిడిపి నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ తెలిపారు. అధికారులు విచారణ చేపట్టి న్యాయబద్ధంగా అర్హులైన వారికి పోస్టును ఇప్పించాలని కోరారు. లేకుంటే న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామని అధికారులను హెచ్చరించారు.

విద్యుత్తు ఛార్జీలపై టిడిపి నిరసన

బొబ్బిలి.. ధర్నా చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన, నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్తుఛార్జీలకు నిరసనగా టిడిపి ఆధ్వర్యాన సోమవారం దాసన్నపేట విద్యుత్ భవనం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగంలో పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని అన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా గాలికి వదిలేశారని మండిపడ్డారు. ట్రూ అప్ ఛార్జీల పేరిట రైతులపై పెనుభారం వేయడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొందన్నారు. స్మార్ట్ మీటర్ల పేరు చెప్పి 57 వేల కోట్ల రూపాయలు అవినీతిలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కూరుకుపోయిందన్నారు. టిడిపి హయాంలో ద్వారపూడిలో ఒక మెగా వాట్ సోలార్ సిస్టం పవర్ ను ఉత్పత్తి చేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తే ఇప్పుడు దాన్ని ఈ ప్రభుత్వం ఫీజులు లేకుండానే కట్ చేసి పక్కన పెట్టేసిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి కార్యదర్శి ఐవిపి రాజు, టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, బంగారు బాబు, మండల టిడిపి అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, గంటా పొలి నాయుడు, కంది మురళి నాయుడు, వేచలపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బొబ్బిలి : విద్యుత్ ఛార్జీల పెంపు దుర్మార్గమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా విద్యుత్ ఇఇ కార్యాలయం వద్ద ఆ పార్టీ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనంతరం ఇఇ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : జగన్మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై పెను భారాన్ని మోపారని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని 11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద టిడిపి ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలాజీ అప్పల రాంప్రసాద్, నాయకులు పాల్గొన్నారు. మండలంలోని పోతనపల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్ ఎదురుగా ఎస్.కోట-విజయనగరం ప్రధానరహదారిపై టిడిపి నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ ఆధ్వర్యాన ధర్నా చేశారు. కార్యక్రమంలో టిడిపి జామి మండల అధ్యక్షులు లగుడు రవికుమార్, సీనియర్ నాయుకులు రెడ్డి పైడిబాబు, రాయవరపు చంద్రశేఖర్, బండారు పెదబాబు, గుమ్మడి భారతి, జుత్తాడ రామసత్యం, ఆడారి రమేష్, జి.సన్యాసినాయుడు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాడంగి : టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలవలస గౌరు, నాయకులు ఎస్.భాస్కర్‌రావు, సత్యనారాయణ, సర్పంచ్ ఎం.సత్యం పాల్గొన్నారు

భోగాపురం : విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ భోగాపురం సబ్ స్టేషన్ వద్ద టిడిపి నియోజకవర్గ ఇంచార్జి కర్రోతు బంగారాజు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో జగన్మోహన్ రెడ్డి విద్యుత్ ఛార్జీలు పెంచనని చెప్పి ఇప్పుడు ఎలా పెంచుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలోని టిడిపి నాయకులు దాసరి అప్పలస్వామి, నీలపు అప్పల రామిరెడ్డి, కోల రామసూరి, సరగడ తోగులురెడ్డి, పిడుగు వెంకట సత్యం, గరికిన చిన్న రాములు, చింతపల్లి రామకృష్ణ, బుగత రామ్మోహన్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మండల టిడిపి అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సువ్వాడ రవి శేఖర్, గేదెల రాజారావు, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, నాయకులు బైరెడ్డి లీలావతి, అవనాపు సత్య నారాయణ, గురాన అసిరి నాయుడు, తాడ్డి సత్యనారాయణ, కాళ్ల రాజ శేఖర్, కలి శెట్టి సీతారాం, నరవ రామ లక్ష్మి, పొడుగు కృష్ణ వేణి తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : కొప్పెర్ల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మండల టిడిపి అధ్యక్షులు మహంతి శంకరరావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ కర్రోతు బంగారాజు, టిడిపి కార్యదర్శి దంగా భూలోక, టి ఎన్‌టియుసి పార్లమెంటరీ అధ్యక్షులు విక్రమ్ జగన్నాథం, నాయకులు పసుపులేటి శ్రీనివాసరావు, పిల్ల లక్ష్మీనారాయణ, ముత్యాల వెంకటరమణ, కొత్తకోట రమణ, మురిపాల బోగేష్ మొంగం మోహన్ రావు, బొంతు రవి, సామంతుల సోంబాబు, రౌతు స్వామి నాయుడు, చందక ఆనందరావు పాల్గొన్నారు.

శృంగవరపుకోట.. ఎస్.కోట- విజయనగరం రహదారిపై బైఠాయించిన టిడిపి నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ, నాయకులు

డెంకాడ : డెంకాడ సబ్ స్టేషన్ వద్ద మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు పల్లె భాస్కర్ రావు, నాయకులు కలిదిండి పాణీరాజు, పడాల చిన్నారావు, చీకటి సుహసిని, కొయనేని రమణ, కలిదిండి రంగరాజు, సిహెచ్.మహేశ్, ఎస్.పైడినాయుడు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని ఉంగరాడ మెట్ట సమీపంలో ఉన్న 133 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ ముందు టిడిపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. టిడిపి మండల అధ్యక్షులు కిమిడి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి నాయకులు రమేష్ నాయుడు, బాలి రామినాయుడు, నాగభూషణరావు, గోవిందరావు, చల్ల భుజంగరావు, గజేంద్ర నాయుడు పాల్గొన్నారు.

గరివిడి: ప్రజలును మోసం చేసే వైసిపి నాయకులును గద్దె దింపాలని చీపురుపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ కిమిడి నాగార్జున అన్నారు. చీపురుపల్లి అర్‌ఈసిఎస్ ఆఫీస్ వద్ద నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఫైల బలరాం, రౌతు కాము నాయుడు, దన్నాన రామచంద్రుడు, సారేపాక సురేష్ బాబు, ముల్లు రమణ, మహంతి రమణమూర్తి, మహంతి అప్పలనాయుడు, గవిడి నాగరాజు, శనపతి శ్రీను, బుటు శ్రీను, మీసాల నవీన్ కుమార్, అరతి సాహు పాల్గొన్నారు.

మెరకముడిదాం: గర్భాం 33కేవి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సోమవారం టిడిపి నిరసన కార్యక్రమం చేపట్టింది. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు, నాయకులు మండల రమణ, మోహనరావు, కెంగువ ధనంజయ, సుబ్బరాజు, పి. సన్యాసి నాయుడు, పి.సింహాచలం, అప్పలనాయుడు, చల్లా శ్రీరామ్ పాల్గొన్నారు.

గంట్యాడ : స్థానిక విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద టిడిపి మండల అధ్యక్షులు కె.భాస్కరనాయుడు ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు.

'స్పందన' ఫిర్యాదులపై తక్షణ చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పోలీసు కార్యాలయంలోసోమవారం నిర్వహించిన స్పందనలో ఎస్‌పి ఎం.దీపిక వినతులు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని, ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్జీలను అన్నింటిపైనా స్పందించిన ఎస్‌పి వారం రోజుల్లో చర్యలు తీసుకోవాలని ఆయా పోలీసు అధికారులను ఆదేశించారు. ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ జె. మురళి, ఎస్‌బి సిఐ సిహెచ్ రుద్రశేఖర్, డిసిఆర్‌బి ఎస్‌ఐలు వాసుదేవ్, ప్రభావతి పాల్గొన్నారు.

కరకవలస ఇందిరమ్మ కాలనీలో

సౌకర్యాలు కల్పించాలని ధర్నా

కమిషనర్ హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కరకవలస వద్దనున్న ఇందిరమ్మకాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం, ఐద్వా ఆధ్వర్యాన సోమవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద కాలనీవాసులు ధర్నా చేపట్టారు. పట్టణ పేదలకు గతంలో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో పట్టాలిచ్చి నిర్మించిన కరకవలస ఇందిరమ్మ కాలనీకి వెళ్లేందుకు రహదారి లేదని, దీని వల్ల తీవ్రమైన ఇబ్బందులకు గురౌతున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ ఆవేదన వ్యక్తంచేశారు. కాలనీ ఏర్పాటు నుంచి సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 500 ఇళ్లు ఉన్న నేటికీ రహదారి లేదన్నారు. ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, వీధి కుళాయిలు లేవని వాపోయారు. సచివాలయ సేవలు అందడం లేదని, ఏ సచివాలయానికి వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. రేషన్ కోసం తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే ఇందిరమ్మ కాలనీకి ప్రధాన రహదారితోపాటు వీధి రోడ్లు నిర్మించాలని, కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళన విరమించేది లేదని కార్యాలయ ప్రధాన గేటు ఎదుట ధర్నా కొనసాగించారు. అనంతరం కమిషనర్ శ్రీరాములునాయుడు వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ధర్నాలో చక్రవర్తి, బుచ్చిబాబు, భారతి, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పిపిఎస్‌ఎస్, ఐద్వా నాయకులు, కాలనీ వాసులు

ఆక్రమిత స్థలంలో చేపట్టిన నిర్మాణాలను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

ఆ భూములు దేవాదాయ శాఖవే

- నిర్మాణ పనులు నిలిపివేత
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని రంగరాయపురం (అగ్రహారం) పంచాయతీలో సర్వే నంబర్ 9/4 లో ఉన్న ఎకరా 19 సెంట్లు దేవాదాయ శాఖదేనని ఆ శాఖ శృంగవరపుకోట డివిజన్ ఇన్‌స్పెక్టర్ పివి లక్ష్మి తెలిపారు. 'ఆలయ భూములు హాంఫట్' అనే శీర్షికతో ప్రజాశక్తిలో సోమవారం ప్రచురణమైన కథనానికి స్పందించి దేవాదాయ శాఖ అధికారులు రామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన ఎండోమెంట్ భూములను పరిశీలించారు. వ్యాపారం నిమిత్తం 12 పిల్లర్లతో పిల్లా కృష్ణారావు 14 సెంట్లలో నిర్మిస్తున్న భూమి కూడా దేవాదాయ శాఖదేనని స్పష్టం చేశారు. ఈ మేరకు నిర్మాణ పనులు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేశారు. అంతకుముందు రంగరాయపురం మాజీ సర్పంచ్ దేగల సాయిలక్ష్మి ఆధ్వర్యంలో పిల్లా ఎర్నిబాబు, కృష్ణారావు , సన్యాసిరావు , అచ్చిబాబు , దేగల వెంకటరమణ, కర్రె అప్పన్నదొర తదితరులు తమ వద్దనున్న ఆధారాలను తహశీల్దార్ తామరాపల్లి రామకృష్ణ, ఎంపిపి గేదెల శ్రీనివాసరావుకు చూపించారు. రామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన దేవాదాయ శాఖ భూముల్లో ప్రయివేటు వ్యక్తులు పట్టాలు ఎలా వచ్చాయో అధికారులే నిగ్గు తేల్చాల్సి ఉంది.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

బొబ్బిలి : మున్సిపల్ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించకపోతే పోరాటం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు హెచ్చరించారు. మస్టర్ కార్యాలయం వద్ద సోమవారం మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు నేటికీ వేతనాలు చెల్లించక పోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నిత్యావసర సరుకుల కొనుగోలుకు, వైద్యానికి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాజ్యాంగ హక్కులపై కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తోందని, ఈ నెల 14 నుంచి రాజ్యాంగ హక్కుల పరిరక్షణ ప్రచారం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు జె.రామారావు, జి.గౌరీష్, కార్మికులు పాల్గొన్నారు.

గణితం పరీక్షకు 99 మంది గైర్హాజరు

విజయనగరం టౌన్ : సోమవారం జరిగిన పదో తరగతి గణితం పరీక్షకు 99మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 127.కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 24072 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 24032 మంది హాజరయ్యారు. 40 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 831 మందికి 772 మంది హాజరయ్యారని డిఇఒ లింగేశ్వరరెడ్డి తెలిపారు.

కలెక్టర్‌కు అభినందన

విజయనగరం : బదిలీపై వెళ్తున్న కలెక్టర్ సూర్యకుమారిని ఫోరం ఫర్ బెటర్ విజయనగరం తరపున పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కాపుగంటి ప్రకాశ్, రోటరీ క్లబ్ అధ్యక్షులు ఉమా బాలాజీ, రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ కార్యదర్శి కొల్లా సాయి మనోజ్, డైరెక్టర్ మధుసూదన్, గోల్డెన్ హెరిటేజ్ గ్రూప్, లిఫ్టింగ్ హ్యాండ్స్ కార్యదర్శి సూర్య లక్ష్మి.. కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కలెక్టర్ సూర్యకుమారి స్పందిస్తూ తాను విజయనగరంలో పని చేసిన కాలం మరచిపోలేనన్నారు. ఎక్కడకు వెళ్లినా ఇది తన పుట్టినిల్లుగానే భావిస్తానని చెప్పారు. ఈ ఊరిలో అందరూ మంచి మనసుతో, అభిమానంతో ఆత్మీయంగా ఎప్పటికీ గుర్తు ఉండేలా నడుచుకుంటారని తెలిపారు.

ఆక్రమణలపై ఫిర్యాదు

వేపాడ : తమ ఇంటి ముందు సిమెంట్ రోడ్డుపై ఓ వ్యక్తి కంచె ఏర్పాటు చేసి, ఆక్రమణకు ప్రయత్నించారని చిన్నగుడిపాలకు చెందిన జక్కాన రాజు.. ఇఒపిఆర్‌డి సూర్యనారాయణకు సోమవారం ఫిర్యాదు చేశారు. వెంటనే ఇఒపిఆర్‌డి స్పందిస్తూ ఆక్రమణలు తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

కొత్తవలస : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ బి.దేవి తెలిపారు. తాడివానిపాలెం గ్రామంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దిశ యాప్, లోన్ యాప్, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు.

స్పందన సమస్యలు పరిష్కారానికి చర్యలు

నెల్లిమర్ల : స్పందనలో వచ్చే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ జి. గిరిబాల సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతి కార్య దర్శులు, సచివాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగు నీరు, పారి శుధ్యం, ఇళ్ల నిర్మాణం, రెవెన్యూ సమస్యలు గుర్తించి సంబంధిత అధికార్ల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పన్నులు వసూళ్లు ముమ్మరం చేసి శత శాతం వసూళ్లు జరగాలని ఆదేశించారు.

పాఠశాలలో తనిఖీలు

వంగర : మండలంలోని మెట్ట మగ్గూరులో గల ఎయిడెడ్ (ఎఇఎస్) పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి యాగాటి దుర్గారావు సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. విద్యార్థులు రాసిన నోటు పుస్తకాలు తనిఖీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగన్మోహనరావుతో మాట్లాడి విద్యా ప్రమాణాలు మెరుగు పరచాలని సూచించారు.

జవాన్ కుటుంబానికి న్యాయం చేయండి

గరివిడి : వీర మరణం పొందిన జవాన్ గోవింద కుటుంబానికి న్యాయం చెయ్యాలని చీపురుపల్లి నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కిమిడి నాగార్జున కోరారు. సోమవారం పర్ల గ్రామంలో నేవీ మెరైన్ కమెండర్‌గా చేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన చందక గోవింద కుటుంబ సభ్యులును పరామర్శించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ చందక గోవింద దేశ రక్షణ కోసం తన జీవితాన్ని అర్పించి, విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించటం చాలా బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గోవింద కుటుంబానికి చెరో రూ.50లక్షలు పరిహారం ప్రకటించాలిని కోరారు. గోవింద కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలిని కోరారు. ఈ కార్యక్రమంలో రౌతు కామునాయుడు, దన్నాన రామ చంద్రుడు, మహంతి అప్పల నాయుడు, ముల్లు రమణ, మీసాల నవీన్, శ్రీధర్, అరతి సాహు, సబ్బి సోనియా, గడే సన్యాసప్పలనాయుడు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

విజయనగరం టౌన్ : పట్టణంలోని దాసన్నపేట పౌరసరఫరాల గోడౌన్స్ ప్రాంతంలో సోమవారం క్షత్రియ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైరల్ జ్వరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు దాట్ల శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు. ఈ శిబిరాన్ని చిట్టిబాబు రాజు ప్రారంభించారు. మిమ్స్ నుంచి డాక్టర్ సంతోష్ రాజు, డాక్టర్ సంజయ్ తదితరులు హాజరై రోగులకు ఉచిత వైద్య సేవలు అందించారు.

నేడు జ్యోతిరావు పూలే జయంతి

విజయనగరం : జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరు అధ్యక్షతన మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతి ఉత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నారు. కలెక్టరేట్ బయట ఉన్న జ్యోతిరావు పూలే కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ

శృంగవరపు కోట : హార్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేద మహిళలకు సోమవారం చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

గుర్ల : మండలంలో జమ్ముపేటలో ఆదివారం రాత్రి అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని గుర్ల ఎస్ఐ హరిబాబు నాయుడు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు అందిన ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి గ్రామానికి చెందిన కురిమినెల్లి రామునాయుడును అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 40 బ్రాందీ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితున్ని రిమాండు నిమిత్తం చీపురుపల్లి సబ్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాజకీయ కక్షతో దుష్ప్రచారం



కొత్తవలస.. ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

'గడపగడపకు మన ప్రభుత్వం'లో కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతిపక్షాలు రాజకీయ కక్షతో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడం తగదని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రజల ముంగిటికి వెళుతుంటే ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సోమవారం 20వ డివిజన్ బుచ్చన్న కోనేరు, నల్లావీధి ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోలగట్ల వీరభద్ర స్వామి మీడియాతో మాట్లాడుతూ స్థానిక సమస్యలను తెలుసుకుని వెనువెంటనే పరిష్కరిస్తూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందిస్తుండడం పట్ల ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. బుచ్చన్న కోనేరు ప్రాంతం గతంలో దుర్గంధ భరితంగా ఉండేదని దానిని అధిక మొత్తంలో వెచ్చించి అభివృద్ధి చేసామని అన్నారు. ప్రజల అవసరాలను తీరుస్తూ సంపూర్ణ మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి ,స్థానిక కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, పైడితల్లమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ నక్కాజ్యోతి, జోనల్ ఇన్‌ఛార్జి కాళ్ళ సూరిబాబు, డివిజన్ అధ్యక్షులు పచ్చిగుళ్ల కృష్ణమూర్తి, యువజన అధ్యక్షుడు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం మండలం పినవేమలి గ్రామంలో సోమవారం గ్రామ సర్పంచ్ పి.సాయి వెంకట సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమం జరిగింది. గృహ కన్వీనర్లు, గృహ సారధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. వారి సందేహాలను నివృత్తి చేస్తూ వారికి పథకాలకు సంబంధించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ గృహ సారథులు అదిబాబు, అప్పారావు, ప్రసాద్, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : అందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. బాలాజీ నగర్ లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడేళ్ల కాలంలో అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు మన ప్రభుత్వం వచ్చాక కలిగే మేలును ప్రజలకు వివరించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఈ మూడేళ్ల కాలంలో అందిస్తున్న సంక్షేమ ఫలాలను నేరుగా వారికి వివరించి వారు పొందుతున్న లబ్ధిని గుర్తు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయ కుమార్, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, ఎల్.కోట జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి, జెసిఎస్ మండల ఇంఛార్జ్ బొంతుల వెంకట రావు, కొత్తవలస సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, పి.చెల్లయ్య, సర్పంచులు ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్లు, కర్రి దేముడు బాబు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని10వ వార్డులో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతీ గడప గడపకు వెళ్లి నాలుగేళ్ళ పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఏ పార్టీలో ఉన్నాసరే వారికి సంక్షేమ పథకాలు అందేవిధంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోం దన్నారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని ఎమ్మెల్యే శంబంగి వివరించి బుక్ లేట్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, మండల పార్టీ అధ్యకులు శంబంగి వేణుగోపాలనాయుడు, బుడా ప్రతినిధి ఇంటి గోపాలరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, తహశీల్దార్ రాజారావు,వార్డు కౌన్సిలర్ ఇంఛార్జ్ తుట్ట తిరుపతి, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు,కో-ఆప్షన్ సభ్యులు,సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, పాల్గొన్నారు.



బొబ్బిలి.. ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

వేపాడ : వేపాడ మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం కొనసాగుతోంది. ఇంటింటికి స్టిక్కర్లను అంటిస్తూ, వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి సచివాలయ కన్వీనర్లు వివరిస్తున్నారు. కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని గొలగాం, బంగార్రాజుపేట, కొండరాజుపేట గ్రామాల్లో సోమవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ద్వారానే సంక్షేమం సాధ్యమన్నారు. మరోసారి జగన్మోహన్‌రెడ్డిని సిఎంను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుర్లే అప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచ్ సాడి దుర్గాదేవి, కొండరాజుపేట సర్పంచ్ సరగడ బంగారు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఒ భూములకు పట్టాలివ్వండి

పురిటిపెంట రైతుల వినతి

తహశీల్దార్‌కు వినతి అందిస్తున్న పురిటిపెంట రైతులు, నాయకులు

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని పురిటిపెంట రెవెన్యూ పరిధిలో తర తరాలుగా సాగు చేస్తున్న భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని కోరుతూ ఆ గ్రామ రైతులు, నాయకులు సోమవారం తహశీల్దార్ అరుణకుమారికి వినతి అందజేశారు. హెల్డోవర్ (హెచ్‌ఒ) భూములకు పాసు పుస్తకాలు లేనందున రైతులంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వ్యవసాయ రుణాలు, రైతు భరోసావంటి సంక్షేమ పథకాలకు దూరవుతున్నారని తెలిపారు. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, అనారోగ్యానికి గురైన సందర్భాల్లో రైతులు ఇబ్బంది పడుతున్నారన వివరించారు. సుమారు 358 మంది రైతులు 500 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయం సాగు చేస్తున్నారని తెలిపారు. పూర్వ కాలం నుంచి ఈ భూములపై హక్కు కోసం కోర్టు వివాదం నడిచిందని, కొన్నేళ్ల క్రితమే రైతులకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ తీర్పు ప్రకారం పట్టాలివ్వాలని కోరారు. అధికారులు స్పందించి భూముల సర్వే చేపట్టి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇప్పించాలని కోరారు. వినతిచ్చిన వారిలో హెచ్‌ఒ భూముల రైతుల కమిటీ నాయకులు కరణం ఆదినారాయణ, మంత్రి నర్సింగరావు, సారికి బంగారునాయుడు, గొర్లె శ్రీనివాస్, ఇనుమల సూరప్పడు, సారికి గణపతి, బాలయ్య, మంత్రి గణపతిరావు, గొర్లె బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని ధర్మవరం హైస్కూల్ ఆవరణలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆలిమ్ కో సంస్థ సహకారంతో ఉపకరణాల పంపిణీ కోసం ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయనతోపాటు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడారు. ప్రభుత్వం వికలాంగుల పునరావాసం, వారి సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. వికలాంగులకు తొమ్మిది స్కూటీలను, బస్సు పాసులను వారు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపిలు ఇందుకూరి సుధారాజు, పినిశెట్టి వెంకటరమణ, సర్పంచ్ జి.సంతోషికుమారి, ఎంపిటిసిలు కనకమహాలక్ష్మి, వాకాడ సింహాచలం, మజ్జి దేవి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ టి.రమణ, జిల్లా వికలాంగ సంక్షేమ అధికారి జగదీష్, ఎంపిడిఒ శేషుబాబు, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, ఇఒ పాత్రో, మాజీ సర్పంచులు బుజ్జి, పోతయ్య, జెసిఎస్ మండల కన్వీనర్ కె.వెంకటరావు, నాయకులు గంగరాజు, సూరి అప్పారావు, రమణ, ప్రసాద్, కిట్టు, కిషోర్ రాజు, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 38, 41, 42 డివిజన్లలో 35.15 లక్షల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సోమవారం ప్రారంభించారు. 38వ డివిజన్లోని ఉడా కాలనీ ఫేజ్-3లో రూ.5.75 లక్షలతో చేపట్టిన వాకింగ్ ట్రాక్‌ను, రూ.6.50 లక్షలతో నిర్మించిన పార్క్ ప్రహరీ గోడను ప్రారంభించారు. 41వ డివిజన్లో రూ.4.65 లక్షలతో నిర్మించిన సిసి రహదారిని, సంజీవ్‌నగర్ కాలనీలో రూ.8.10 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డును ప్రారంభించారు. 42వ డివిజన్లో కామాక్షినగర్‌లో రూ.10.15 లక్షలతో చేపట్టిన రహదారిని ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, కార్పొరేటర్ పిన్నింటి కళావతి మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. ఉడా కాలనీ ఫేజ్-3లో పార్కుకు ఆనుకొని ఉన్న వాటర్ ట్యాంకు అపరిశుభ్ర వాతావరణంలో ఉండడంపై డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అధికారులపై మండిపడ్డారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తొగురోతు సంధ్యారాణి, వైసిపి నాయకులు పిన్నింటి సూర్యనారాయణ, నారాయణప్పుడు తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంకును పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విమలా రణదివే స్ఫూర్తితో కార్మిక హక్కుల కోసం ఉద్యమం

సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి సురేష్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విమలా రణదివే స్ఫూర్తితో కార్మిక హక్కుల కోసం ఉద్యమించాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్ పిలుపునిచ్చారు. విమలా రణదివే 108వ జయంతి సభను కె.ఎల్.పురంలో ఉన్న సిఐటియు కార్యాలయంలో సోమవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విమల చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ విమలా జీవితాంతం సామ్రాజ్యవాద వ్యతిరేకిగా నిలబడ్డారని తెలిపారు. పని ప్రదేశంలో మహిళలు ఎదుర్కొనే అనేక సమస్యలను పరిష్కరించారని చెప్పారు. సిఐటియు అఖిల భారత శ్రామిక మహిళా సమన్వయ కమిటీ స్థాపించినప్పటి నుండి తన జీవితాంతం వరకు కన్వీనర్‌గా ఉన్నారని తెలిపారు. వాయిస్ ఆఫ్ వర్కింగ్ ఉమెన్, కామ్ కాజీ మహిళ.. పత్రికలకు ఎడిటర్‌గా పనిచేశారని, 'భారత శ్రామిక మహిళలు'తో సహా అనేక పుస్తకాలు రాశారని తెలిపారు. 1999 జులై 24న విమలా మరణించే వరకు సమావేశాలకు హాజరుకావడానికి ప్రాధాన్యత ఇచ్చేవారన్నారు.

కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, పెన్షనర్స్ సంఘం నాయకులు ఎ.నాగభూషణం, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.త్రినాత్, తదితరులు పాల్గొన్నారు.

విమలా రణదివే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

ఎస్ఎఫ్ఐ నాయకులపై సస్పెన్షన్ ఎత్తేయాలి

కోట జంక్షన్ వద్ద నిరసన చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలోని పరీక్షా ఫలితాలలో వచ్చిన అవకతవకలపై ప్రశ్నించిన ఎస్ఎఫ్ఐ నాయకులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు సోమవారం కోట జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రశ్నించడమే నేరం అన్నట్టు పరీక్షా ఫలితాలలో జరిగిన అవకతవకలపై ప్రశ్నించిన ఐదుగురు ఎస్ఎఫ్ఐ నాయకులపై సస్పెన్షన్ వేటు వేయడం ప్రజాస్వామ్యానికి, భావప్రకటన స్వేచ్ఛకు మాయని మచ్చన్నారు. మరోపక్క కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తమ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని విద్యార్థుల మెదళ్లలోకి ఎక్కించేందుకు యూనివర్సిటీ విసిలను కేంద్రం వద్ద మెడలు వంచే వారిని నియమిస్తుందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. క్యాంపస్ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, ప్రశ్నించే గొంతుకలపై అణచివేత ఆపాలని, విసిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన విద్యార్థులను కలుపుకొని పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సిహెచ్ పావని, జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నబాబు,జిల్లా సహాయ కార్యదర్శులు రాము, రామకృష్ణ, రవి, జగదీష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరీష్, ప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -భోగాపురం

మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12న మండల కేంద్రానికి వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి రానున్నట్లు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. భోగాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వై.వి సుబ్బారెడ్డి పర్యటన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న సభా స్థలానికి సంబంధించిన ఏర్పాట్లను వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణతో కలిసి పరిశీలించారు. గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు, వాలంటీర్లు, మండల ముఖ్య నేతలంతా ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెఎస్‌సి కన్వీనర్ ఎర్రప్పల నారాయణ, వైసిపి నాయకులు పడాల భాను, కొమ్మూరు సుభోషణరావు, పోతిరెడ్డి గోపి, ఉదయ బాబు, చెల్లుబోయిన రాము, సుందర వెంకటేష్ పాల్గొన్నారు.

రెండు పూటలా పని రద్దుచేయాలని ధర్నా

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ఉపాధి హామీలో రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేసి, ఒక పూట పని చేయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలతో సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పద్ధతిలో ఉపాధి మేట్ల నియామకం చేపట్టి ఎన్ఎంఎంఎస్ యాప్ రద్దు చేయాలన్నారు. 200 రోజులు పని కల్పించి, రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి మేట్లకు అదనపు వేతనం ఇవ్వాలన్నారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయ ఎఒ ఎంవిఎ దొరకు వినతి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు తరిణి వెంకటరమణ, ముత్యాలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఎఒకు వినతి అందిస్తున్న వ్యకాస నాయకులు

బాల్య వివాహాలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఎంపిపి సత్యవంతుడు

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం బాల్యవివాహాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి డి.సత్యవంతుడు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించ వద్దని కోరారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ, పిహెచ్‌సి వైద్యాధికారి కె.రాజు, సిడిపిఒ ఆర్.ఉమాదేవి, ఎసిపిఒ బి.లక్ష్మీబాయి, ఎపిఎం ఆర్.శ్రీనివాసరావు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్.వెంకటరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈర్లే సన్యాసినాయుడు, వేపాడ సర్పంచ్ ఎం.అర్జునమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ కె.కామేశ్వరి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

శివ్వాంలో కూలిన పూరిల్లు

ప్రజాశక్తి-వంగర

మండలంలోని శివ్వాం గ్రామంలో రాత్రి 8 గంటల సమయంలో బొత్స అప్పల నారాయణమ్మ చెందిన పురిల్లు సోమవారం రాత్రి 8 గంటల సమయంలో కూలిపోయింది. ఆ సమయంలో ఆమె ఇంటి బయట ఉండటంతో ప్రమాదం తప్పింది. ఇటీవల వరుసగా వర్షాలు కురుస్తుండడంతో గోడలు తడిసి పోవటం వల్ల ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే పేద కుటుంబానికి చెందిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని అప్పలనారాయణమ్మ కోరింది.

ఆటో డ్రైవర్‌కు జరిమానా, జైలు శిక్ష

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మద్యం సేవించి వాహనం నడిపిన ఆటో డ్రైవర్‌కి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ పి. నారాయణ రావు తెలిపారు. సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ గత నెల 24న తన సిబ్బందితో స్థానిక రామతీర్థం జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా రామతీర్థం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తాడి సతీష్ కుమార్ మద్యం తాగి వాహనం నడుపుతున్నట్లు గుర్తించామన్నారు. అతనిపై మోటారు వాహనాల చట్టం కింద కేసు నమోదు చేసి సోమవారం సెకండ్ క్లాస్ జిల్లా మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరచగా డ్రైవర్‌కు 5రోజులు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించారన్నారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం.. దన్నానపేటలో సోమవారం దాడులు చేసి అక్రమంగా సారా ప్యాకెట్లు కలిగిన ఒకరిని అరెస్టు చేశామని ఎస్ఐ నారాయణరావు తెలిపారు. 70 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

మద్యం తరలిస్తున్న మహిళ అరెస్ట్

ప్రజాశక్తి-కొత్తవలస

అక్రమంగా మద్యం తరలిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు సిఐ బాల సూర్యారావు తెలిపారు. బలిగొట్టం గ్రామానికి చెందిన ఓ మహిళ మద్యం సీసాలను తరలిస్తుండగా సోమవారం ఎస్ఐ బి.దేవి పట్టుకొని అరెస్ట్ చేశారు.

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిలు జడ్జి కోర్టులో
IP 1/2023

Between :
బొమ్మిరెడ్డిపల్లి ప్రసాద్ S/o లేట్ సన్యాసిరాజు,
One way Traffic, S.Kota. ......పిటిషనరు
And:
1. నంబూరి భైరాగిరాజు, S/o లేట్ సత్యనారాయణ రాజు, Rly Station Road, S.Kota.
2. పొణుగుపాటి ముకుంద, S/o లేట్ పట్టాబి, బ్రాహ్మణవీధి, S.Kota.
3. ఉగిరి శంకరరావు, ముస్లింవీధి, S.Kota.
4. వేమలి రమేష్ S/o జగన్నాథం, పందిరప్పన్న జంక్షన్, S.Kota.
5. గనివాడ స్వామినాయుడు, S/o లేట్ సోములు, కొటానువీధి, S.Kota.
6. వెలుచూరి నాగమణి, W/o లేటు అప్పలనాయుడు, మునసబువీధి, S.Kota.
7. అంగడి అచ్చియ్యమ్మ, W/o ఆదినారాయణ, చుక్కవీధి, S.Kota.
8. పొట్నూరు జగన్నాథంనాయుడు, S/o క్రిష్ణ, కాపుసోంపురం, S.Kota.
9. జీర క్రిష్ణ S/o పొట్టి బాబు, జీలుగుపాడు, అనంతగిరి మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా.

NOTICE

యీ నెంబరులో పిటిషనరు మీ అందరిపైని Insolvency పిటిషను పై కోర్టులో దాఖలు చేసినందున సదరు విషయమై మీకు ఎట్టి అభ్యంతరములున్నచో యీ కోర్టువారి ఎదుట **తే 25-04-2023దిని పగలు 10-30 గంటల్కు** స్వయంగా లేదా వకీలు గారి ద్వారా హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించడమగును.

శ్రీ కోర్టువారి అనుమతితో

పెదగాడ నాగేశ్వరరావు
న్యాయవాది, శృంగవరపుకోట,
విజయనగరం జిల్లా
సెల్ : 9347544360